# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

AUGUST - 1999

# సంక్షిప్త వార్తలు

1999 జూలై 17వ తేదీ శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో గొల్లవాని తిప్పరోడ్డులో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆరాధన మందిరము క్రీస్తు సేవకొరకు ప్రతిష్ట చేయబడెను. జాషువా గారి కుమారులు జాన్ రిక్కీ గారు రిబ్బను కత్తిరించి ఆలయ ప్రతిష్ట చేసిరి. సోదరులు జాషువా గూటం గారు, జి.షడ్రక్ గారు (పాలకొల్లు), జాన్ రిక్కీ గూటం గారు వాక్య పరిచర్య చేసిరి. ఆ దినము ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. గొల్లవాని తిప్పరోడ్‌లో సోదరులు గొల్ల రాజారావ్ గారు క్రీస్తు కొరకు ఆయన సంఘము కొరకు తీవ్రమైన కృషి చేయుచున్నారు.

జూలై 23వ తేదీ శుక్రవారం ఉభయ గోదావరి జిల్లాల సువార్తికుల సదస్సు కాకినాడలో, సత్యవాణి భవనంలో ఆనందదాయకమైన వాతావారణంలో ఘనముగా జరిగెను. పలు గ్రామములనుండి, పట్టణములనుండి వచ్చిన సువార్త ప్రకటించు సోదరులతో సత్యవాణి భవనము కిటకిటలాడెను. ఒకరోజు ముందుగానే అమెరికా నుండి కాకినాడ చేరుకొనిన జెరెమి బేరియర్ దంపతులు, మరియు టాడ్‌జాన్సన్‌లు ఈ సదస్సులో పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. వీరు ముగ్గురు 20 సంవత్సరముల ప్రాయము గల యౌవనస్థులు. మరియు జాషువా గారి కుమార్డు రిక్కీ గారితో కలసి అమెరికాలో విద్యనభ్యసించుచున్నారు. అయినను దేవుని గ్రంథమునుండి బహువిలువైన పాఠములను ఉపదేశించగా హాజరైన వారందరు వారిని ప్రశంసించిరి. వారి తరువాత జాన్ రిక్కీ గారు కూడ వాక్య పరిచర్య గావించిరి.

జెరెమి బేరియర్ గారు సంఘ నిర్మాణము, పాలన పద్ధతిని గూర్చి బోధిస్తు ప్రతి స్థానిక సంఘములోను పెద్దలను ఏర్పాటు చేయవలసిన లేఖన పూర్వకమైన అవుసరమును గూర్చి, పెద్దలయొక్క పని, అర్హతలను గూర్చి బోధించిరి. సంఘ పెద్దలుగా యుండువారు స్థానికులై యుండాలి, వారు మందను కాయాలి,

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 63722

Editor :

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 20 ఆగష్టు 1999 సంచిక 1


## విశ్వాస భ్రష్టత్వము సంభవించిన విధానము
(The Development of Apostacy)

పరిచయము : దేవుడు తన కుమారుని ఈ లోకమునకు పంపుటకు ఎట్టి ఏర్పాట్లు చేసెనో క్రీస్తు తన సంఘము నావిష్కరించుటకు ఎట్టి ఏర్పాట్లు చేసెనో తెలిసికొనియున్నాము. సంఘము దినదినాభివృద్ధి నొందుచుండగా పునరుత్థానుడైన క్రీస్తు యొక్క వర్తమానము ప్రపంచమందంతటా నలుమూలలా వ్యాపించెను. అయితే కొంతకాలమునకు అంతరంగిక క్షీణత ప్రారంభమై విశ్వాస భ్రష్టత్వము సంభవింప మొదలిడెను. కొందరు విశ్వాసము నుండి తొలగిపోయి, మందను కనికరింపక శిష్యులను తమ వెంట ఈడ్చుకొనిపోదురు పాపపురుషుడు బయలు పరచబడును అని పరిశుద్ధాత్ముడు ముందుగనే చెప్పెను.

అందువలన సంఘ చరిత్రను పఠించు ప్రతి విద్యార్థియు కళంకిత సంఘవు యొక్క ఆరంభము, దాని విస్తరణను జాగ్రత్తగ గమనించుట అత్యవసరం. దీనిని

గూర్చి అపొస్తలులు ముందుగనే సూచించి యుండిరి. నిజసంఘమును గుర్తించి, పూర్తిగా మనం గ్రహించుకొనవలెనంటే భ్రష్టత్వములో పడిపోయిన సంఘమును గూర్చి మనం ఎంత తెలుసుకొంటే అంత మంచిది. యేసుక్రీస్తు యొక్క బోధ, మాదిరి యొక్క ఫలితమే భ్రష్టత్వ సంఘమయితే, మానవజాతి యొక్క సంక్షేమమును కాంక్షించువారు దానిని అంగీకరించనవుసరం లేదు. అయితే ఈ భ్రష్టత్వము క్రీస్తు బోధల యొక్క పర్యవసానము కానేకాదు. అట్టిది ఎందుకు సంభవించెనో మనము పూర్తిగ గ్రహించుకోలేకపోవచ్చును. అయితే మానవునికేది మేలైనదో దానిని ప్రబోధించుటలో క్రీస్తు అనుచరులు ఎల్లవేళలా ముందున్నట్లు చరిత్ర ఘోషించుచున్నది. అంతేగాక విశ్వాస భ్రష్టత్వము పాతుకుపోయిన రోజులలో కూడా దేవుని వాక్యమునకు నమ్మకముగా యున్న యదార్థమైన శిష్యులు లేకపోలేదు.

ఈ పాఠంలో విశ్వాసభ్రష్టత్వము ఏల సంభవించెనో లేక అదెట్లు కలిగెనో తెలిసికొనుటకు ప్రయత్నము చేయుదము. మొదట సంఘపాలన పద్ధతిలో కలిగిన మార్పులను గమనింతము. తరువాత పాదిరులకును(Clergy) సామాన్య సంఘ సభ్యులకును (laity) మధ్య ఉద్భవించిన వ్యత్యాసమును గమనింతము. చివరిగా, సూక్ష్మమైన క్రొత్త నిబంధన ఆరాధన ఎట్లు కలుషితము చేయబడెనో గమనింతము.

## పాలన పద్ధతిలో మార్పులు

**కలుషితము చేయబడిన సంఘపెద్దల పని :** అపొ.పౌలు ప్రవచించినట్లే సంఘపెద్దలు విశ్వాసము నుండి తొలగిపోవుట కారంభించిరి (అపొ.కా. 20:28).

సంఘములో రెండే రెండు రకములైన పదవులున్నాయని మనము ఇదివరకే నేర్చుకొని యుంటిమి. అవి : పెద్దలు (Elders), పరిచారకులు (Deacons) అనునవి. సంఘపాలన యొక్క అధికారమంతయు పెద్దలే కలిగియుండిరి. ప్రతి స్థానిక సంఘములోని పెద్దలు అధ్యక్షులని (Bishops), కాపరులని (Pastors ),

పర్యవేక్షులని (Overseers), మందను కాయువారని (Presbyters) పిలువబడిరి. ప్రతి స్థానిక సంఘములోను ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది పెద్దలుగా యుండిరి. వీరందరు సమానాధికారము కలిగియుండిరి. పరిచారకులు స్థానిక సంఘములో పరిచర్య చేయుటకు నియమింపబడిరి. కేథలిక్కుల యొక్కయు, ప్రెస్బిటేరియన్ల యొక్కయు, మిగతా మతశాఖల యొక్కయు సంఘపాలనా పద్ధతులు బైబిలులో లేనివి.

రెండవ శతాబ్దములో స్థానిక సంఘపెద్దల సమావేశములకు ఎల్లవేళలా అధ్యక్షత వహించుటకు ఒక పెద్దను ప్రెసిడెంట్‌గా నియమించు పద్ధతి ఆరంభమైనది. మిగతా పెద్దలనుండి గుర్తించుటకు గాను అతనిని బిషప్పు అని పిలుచుటారంభమైనది (Cox page 26).

క్రమముగా ఇట్టి "బిషప్పుల" అధికారము విస్తరించుటకు మొదలిడెను. సరిగదా ఒకే జిల్లాలో యున్న సంఘములు సంఘటితము కాగా వాటిపై ఏలుబడి చేయుటకు ఈ బిషప్పు యొక్క అధికారము విస్తరించెను. యితని అధికారము క్రిందనున్న ప్రాంతము, లేక జిల్లా డయోసిస్ (diocese), అని పిలువబడెను.

ఈ డయోసిస్ పెద్దది అయిపోతే దానిని విభజించి దానిపై గ్రామీణ బిషప్పులు ఏర్పాటు చేయబడిరి. బిషప్పులకును ప్రెస్బిటర్లకును మధ్యనున్న స్థానము వారిదాయెను.

ఒకే రాష్ట్రములో గాని, ఆ రాష్ట్రభాగములో గాని యున్న డయోసిస్‌లను పర్యవేక్షించుటకు గాను మరియొక అధికారి నియమించబడెను. అతడు ఆర్చిబిషప్ అని పిలువబడెను.

తరువాత ఒకే దేశములో యున్న డయోసీస్‌లన్నిటిని పాలించుటకు గాను కార్డినల్ అనునతడు ఏర్పాటు చేయబడెను. సంఘపాలన పద్ధతిలో ఇన్ని మార్పులు చేయబడిన తరువాత, ఆ పనిలో వారింకా ముందుకు పోవుటకు సాహసించిరి.

వారు సార్వజనిక బిషప్పును లేక పోప్‌ను (Universal Bishop or Pope) నియమించుటకు ఒక్క అడుగు మాత్రమే వెనుక యుండిరి. చివరిగా క్రీ॥శ॥ 606లో మొదటిపోపు ఆవిర్భవించెను.

క్రైస్తవులనబడే వారి తలంపులలో వచ్చిన మార్పులను బట్టి ఇట్టి విశ్వాసభ్రష్టత్వము సంభవించెను. అనేకులు దియొత్రెఫే వలె ప్రధానత్వమును కోరుట వలన విశ్వాసమునుండి ఈ విధముగా తొలగిపోయిరి (3యోహాను:9).

## సంఘకౌన్సిళ్లు, సినడ్లు ఆరంభించుట :

రెండవ శతాబ్దము వరకు స్థానిక సంఘముల స్వయంపాలనా పద్ధతి కొనసాగెను. అయితే సంఘాలలో ఆయా సమస్యలు తలెత్తుచుండగా బిషప్పులనబడినవారు, సంఘ పెద్దలు తరుచు కూడుకొనుటకు మొదలిడిరి. వారికూడికలు కౌన్సిళ్లాయెను.

ఈ కౌన్సిళ్ల యొక్క ఉనికి రెండవ శతాబ్దము యొక్క మధ్యభాగము వరకు కనబడవు గాని ఆ తరువాత సంఘపాలనా పద్ధతినంతటినీ అవి మార్చివేసినవి (Mosheim 1;116-7).

వీటివలన సామాన్య క్రైస్తవుని యొక్క పలుకుబడి, ప్రభావము క్షీణించి బిషప్పుల యొక్క అధికారము బహుగా హెచ్చింపబడెను.

ఈ కౌన్సిళ్లకు అధ్యక్షత వహించిన వారు మెట్రోపాలిటన్‌లు అనబడిరి. యిదొక గొప్ప అధికారము గల స్థానమాయెను.

పెద్ద పెద్ద పట్టణముల సంఘపాలకులను (Patriarchs ) అనగా ముఖ్యతండ్రులు (Chief Fathers ) అని పిలిచేవారు.

పౌరోహిత్యఐక్యతను కొనసాగించుటకు కౌన్సిళ్లు, సినడ్లు ఎంతో సహాయ పడడమే గాక, విశ్వాస క్రమశిక్షణల సమస్యలను నిర్ధారించుటకుపకరించినవి (Schaff II ; 76 ) .

5.

మొదట్లో ఈ కౌన్సిళ్లు ఒకదానితో ఒకటి సంబంధము లేకుండా ఆయా రాష్ట్రాలలో జరిపించబడేవి. అయితే క్రీ॥శ॥ 325లో నైసియా పట్టణములో మొదటి జనరల్ ఎక్యూమినికల్ కౌన్సిల్ జరిపించబడెను.

ఈ జనరల్ కౌన్సిళ్లు సంఖ్యలో విస్తరించుట వలన, ప్రపంచమందంతటా నాయకులను కలిగియున్న ఒక గొప్ప రాజకీయ శక్తిగా సంఘము మారినట్లగుపడెను. సార్వజనిక బిషప్పు లేక పోపు యొక్క భావాలు ఈ కౌన్సిళ్లలో నుండే బయలు వెడలెను.

క్రొత్త నిబంధనలో క్రీస్తును, ఆయన అపొస్తలులును యిచ్చిన సూక్ష్మ పాలనా పద్ధతికి ఈ మార్పులు ఎంత భిన్నమైనవో గ్రహించుము.

**I విశ్వాస ప్రమాణముల (Creeds) ఆరంభము :**

దేవుని వాక్యము యొక్క సర్వ సంపూర్ణతను నిరాకరించు విశ్వాస ప్రమాణములు ఆరంభమగుట వలన సంఘము విశ్వాసమునుండి మరికొంత తొలగిపోవుట జరిగినది.

- ఈ విశ్వాస ప్రమాణములు వివిధ కౌన్సిళ్ల ఉనికి వలన ఉద్భవించినవి. ఈ కౌన్సిళ్లు విశ్వాససంబంధమైన శాసనములను జారీచేయు హక్కు తమకు కలిగినట్లు ఆరోపించుకొననవి (Schaff II :176).

- అపొస్తలుల విశ్వాస ప్రమాణము అనబడేది అపొస్తలుల వలన గాక మరెవరి వలననో రెండవ శతాబ్దపు మధ్యలో జారీచేయబడెను.

- అధనాసియస్ విశ్వాస ప్రమాణము (Athanasius creed) నాలుగవ శతాబ్దములో తయారు చేయబడెను. ఆంగ్లికన్ సంఘము(Churh of England) నేటికింకను దానిని వాడుచునేయున్నది.

- నైసియా విశ్వాస ప్రమాణము(Nicene creed) నైసియా పట్టణములో క్రీ॥శ॥ 325వ సంవత్సరములో జరిగిన కౌన్సిల్‌లో తయారుచేయబడెను. అనాడు

హాజరైన 300 మంది బిషప్పులచే ఈ విశ్వాస ప్రమాణము వ్రాయబడెను.

- ఈలాగున మానవులచే వ్రాయబడిన విశ్వాస ప్రమాణము నేడున్న అనేక మతశాఖల యొక్క విశ్వాస క్రమము, విశ్వాస సూత్రములు, ప్రమాణ పుస్తకములకు, క్రమశిక్షణలకు (Churh manuals, Confessions of Faith, Catechisms, Creeds and diciplines) మూలమాయెను.

- విశ్వాస ప్రమాణములు (Creeds) అనునవి మానవులు కల్పించిన పద్ధతులు, అభిప్రాయములు మాత్రమే. వాటిని యేసుప్రభువు నిశితముగా ఖండించెను. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని" అవి బోధించుటకు ప్రయత్నించును (మత్తయి15:9; తీతు 1:13-14).

- క్రైస్తవునికున్న విశ్వాస ప్రమాణము ఒకే ఒక్కటి : "అది యేసుక్రీస్తు సజీవుడైన దేవుని కుమారుడని నమ్ముటయే" (మత్తయి 16:16).

- ఏ విశ్వాస ప్రమాణమైనా బైబిలుకు అధికముగా యుంటే, దానిలో అధికముగా యున్నది.

- ఏ విశ్వాస ప్రమాణమైనా బైబిలుకు తక్కువగా యుంటే, అది తక్కువగా యున్నది.

- ఏ విశ్వాస ప్రమాణమైనా బైబిలులో యున్నదానినే కలిగియుంటే, అది అనవసరము. ఏలయనగా మనకు బైబిలున్నది.

## II మతాచార్యులు (Clergy) పౌరోహిత్య సంబంధ పద్ధతి (Sacerdotalism) ఆరంభము :

క్రొత్తనిబంధన విశ్వాసమునుండి తొలగిపోవుట వలన సంఘములో బోధకుల కులము ప్రత్యేకముగా ఏర్పడినది. అది వారిని సామాన్య సభ్యులనుండి వేరు చేసినది.

- విశ్వాస భ్రష్టత్వము సంభవింపక ముందు క్రైస్తవులందరు సమానులే. ప్రతివారు దేవుని యెదుట యాజకులే (ప్రక 1:5; 6; 5:10).

- పురోహితులు(clergy) సామాన్యసభ్యులు(laity) మధ్య వ్యత్యాసము బిషప్పులచే పాలింపబడు(episcopal) పద్ధతి వలన మరింత ఎక్కువాయెను.

- రోమా ఆచార్యాధిపత్యము(hierarchy) అభివృద్ధిజెందగా పురోహితులు ఒక ప్రత్యేక ప్రజలుగా పరిగణింపబడుటయే గాక, దేవునికి మానవునికి మధ్య వార్తావాహులుగా యుండతగిన వారు వారేయనియు గుర్తింపు పొందిరి (McClintock and Strong).

- ఈ పద్ధతిని ఈ దిగువవారు మొదట ప్రబోధించిరి :

- ఇగ్నేషియస్ అనునతడు క్రీ॥శ॥ 110లో, మానవుడు దేవునియొద్దకు చేరుటకు పురోహితులు అత్యవసరమని చెప్పెను (Schaff II :25).

- రోమా పట్టణమునకు చెందిన క్లెమెంతు అనునతడు (క్రీ॥శ॥ 110) కొరింథీయులకు ఒక ఉత్తరము వ్రాస్తూ ప్రజలను సామాన్య సభ్యులు (laymen) అని మొదటిసారిగా సంబోధించెను. పౌరోహిత్య సంబంధ పద్ధతి కంతటికి యిది బీజమాయెను (Schaff II :126).

- తెర్తుల్లు (Tertullian) అనునతడు (క్రీ॥శ॥ 160-240) పౌరోహిత్య సంబంధ పద్ధతిని సమర్థించెను (Schaff II :126).

- క్రీ॥శ॥ 238లో చనిపోయిన సిప్రియన్ అనునతడు పౌరోహిత్య సంబంధమైన క్రైస్తవ పరిచర్యకంతటికి తండ్రి ఆయెను. అతడు అహరోను యాజక ధర్మమునకు, క్రీస్తు సువార్త బోధకులు సమానాంతరముగా యున్నారని వాదించెను(Schaff II :126).

- సామాన్య క్రైస్తవులకు, పురోహితులకు మధ్య వస్త్రధారణలో కూడ వ్యత్యాస

మున్నట్లగుపడు చిత్రవర్ణపు పని మొదట ఆరవ శతాబ్దములో రావెన్నలో యున్న సెయింట్ వైటాలిస్ ఆలయములో అగుపడెను. మరియు అదే కాలములో యున్న మరియొక చిత్రవర్ణపు పని కాన్‌స్టాంటినోపిల్ పట్టణములో సెయింట్ సోఫియా ఆలయములో అగుపడెను (Fischer. page 121).

గమనిక : ఇవ్విధమైన విశ్వాస భ్రష్టత్వము వలన బోధకులు, మతనాయకులు, దేవునికే చెందవలసిన 'ఫాదర్', 'రెవరెండ్' అను బిరుదులు తాము ధరించు కొనుటకు సాహసించిరి. "భూమిమీద ఎవనికైనను తండ్రి (Father) అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోక మందున్నాడు" అని యేసుప్రభువు బోధించెను (మత్తయి 23:9). మరియు "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపతగినది" (Holy and Reverend is His Name) అని బైబిలు బోధించు చున్నది (కీర్తన 111:9). ఈ బిరుదులను ధరించువారు అణకువ లేనివారు గను, అహంకారులుగను అగుపడుచు వినయవిధేయతలు, సాత్వీకము ప్రదర్శించిన అపొ.పేతురు, పౌలులకు భిన్నముగా యున్నారు (అపొ.కా. 10:24-26; 14:13-15). కేథలిక్కుల యొక్కయు మతశాఖల యొక్కయు పద్ధతి క్రొత్త నిబంధనకు ఎంత వేరైనదో బహుశా దీనివలన మనము గమనించుకోగలము.

ఈ విశ్వాస భ్రష్టత్వము ఏదో ఒక క్రొత్త పద్ధతి వైపు తొలగిపోయినట్టిది కాదు. గాని, అనేక విషయాల్లో అతి పురాతనమైన యూదా మత యాజక ధర్మము వైపు మరలినట్టిదే. అయితే అది ఎత్తివేయబడెను, సిలువకు మేకులతో కొట్టివేయబడెను. "కుక్క తన వాంతికి తిరిగినట్టును కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అను నిజమైన సామెతె" ఈ విషయంలో నెరవేరెను (2పేతురు 2:22).

## 9.
# పాడుచేయబడిన ఆరాధన

కొంత కాలమయ్యేసరికి క్రొత్త నిబంధన యొక్క సూక్ష్మమైన ఆరాధన గుర్తించలేనంత విధముగా మార్పు చేయబడెను. మొదటి శతాబ్దపు ఆరాధన ఎంట్లుండెనో తెలిసికొనుటకు "క్రీస్తు సంఘము యొక్క పునాది, రూపురేఖలు" అను వ్యాసమును చదువుము. (సత్యవాక్కు మే 1999).

**రెండవ శతాబ్దపు ఆరాధన ఎట్లుండెను ?**

క్రీ॥శ॥ 100 -163లో జీవించిన జస్టిన్ మార్టిర్ అనునతడు ఈ విధముగా దానిని వర్ణించాడు : "ఆదివారము అనబడే రోజున ప్రతివారము పట్టణములలోను పల్లెల లోను నివసించు క్రైస్తవులు ఒక స్థలమందు సమావేశమయ్యేవారు. అపొస్తలుల వ్రాతలు (సువార్తలు), ప్రవక్తల గ్రంధములు సమయమున్నంత వరకు చదివి వినిపించేవారు. లేఖనములు చదువుట ముగించబడినప్పుడు అధ్యక్షుడు(బోధకుడు) చదువబడిన వాటిలోయున్న శ్రేష్టమైన లక్షణముల ననుకరించవలెనని ఉపదేశించేవాడు. అప్పుడు అందరము లేచి ప్రార్థించేవారము. ప్రార్ధనానంతరము రొట్టె, ద్రాక్షారసము అందించబడేవి. అప్పుడు ఒక్కొక్క దానికొరకు అధ్యక్షుడు తన తలాంతననుసరించి ప్రార్థింపచేయించేవాడు, కృతజ్ఞత చెల్లించేవాడు. అప్పుడు ప్రజలందరు ఆమేన్ అని చెబుతు తమ ఏకీభావమును తెలియజెప్పగా అవి అందరికి పంచిపెట్టబడేవి. దానిలో పాలుపుచ్చుకొన్న వారందరు కృతజ్ఞత చెల్లించేవారు. అప్పుడు ఆరాధనకు రాని వారి యిండ్లకు పరిచారకులు వాటిని తీసికొనివేళ్లేవారు. మరియు ధనికులు, పేదలు కూడ తమ స్వేచ్ఛానుసారముగా యిష్ట పూర్వకముగా తమ సామర్ధ్యమును బట్టి కానుకలు యిచ్చేవారు. ఈచందా అధ్యక్షుని దగ్గర యుంచబడి అనాధులకు, విధవరాండ్రకు, ఖైదీలకు, ఆయా అవుసరములలో యున్నవారికి అక్కరలు తీర్చుటకు ఉపయోగింపబడేది" (Halley page 370).

గమనిక : ఈ యారాధన క్రమము మొదటి శతాబ్దములో వలెనే సూక్ష్మమైనది. వారు శనివారమున గాక ఆదివార దినమున ఆరాధించిరి. అడ్వెంటిస్టు వారుఎన్ని చెప్పినా, వారు మాత్రం ఆదివారమున ఆరాధనకు కూడుకొనిరి. వారు బైబిలు పఠనము గావించి, వాక్యోపదేశము జరిగించిరి. తరువాత ప్రార్థన, ప్రభురాత్రి భోజనము జరిగించిరి. వారు పాటలు పాడినట్టు ప్రత్యేకముగా చెప్పబడలేదు గాని, ప్రతివాడు స్వేచ్ఛాపూర్వకముగా యితరులకు సహాయపడు నిమిత్తము కానుకలనిచ్చిరి. ఈ విధముగా మొదటి శతాబ్దములోని క్రైస్తవులవలె వారు సూక్ష్మమైన ఆరాధన జరిగించిరి. వారు ఆరాధనకు యేమీ కలుపలేదు. ఈరీతిగా క్రొత్త నిబంధన లేఖకుల, ఆదిమ చరిత్రకారులు ఏకీభావమునే వ్యక్తపర్చుచున్నారు.

## మూడవ శతాబ్దము దాని తరువాత ఆరాధన ఎట్లుండెను ?

ఆచారకర్మలు (Ritualism). ఆరాధననలో ప్రవేశించెను. ప్రతిమలు, బొమ్మలు, అవశేషములు (relics). మొదలైనవి ప్రవేశపెట్టబడెను (Fischer page 63,117). క్రమముగా సిలువ గుర్తుకు ఒక రకమైన అమోఘమైన లక్షణమున్నట్లు ఆపాదింపబడుట మొదలిడెను. నాలుగవ శతాబ్దములో పరిశుద్ధుల ఆరాధన (saint worship ) ప్రారంభమాయెను. మరణించిన పరిశుద్ధులను, హత సాక్షులను పూజ్యనీయులుగా పరిగణించుటకు ప్రారంభమాయెను. మృతుల కొరకు ప్రార్థనలు, వారి వర్థంతి దినాన అర్పణలు అర్పించుట మూడవ శతాబ్దములో మొదలిడెను (Walker, page 93). పోప్ వైటాలియన్ అనునతడు క్రీ॥శ॥ 666లో ఆరాధనలో వాద్య సంగీతము ప్రవేశపెట్టెను. ఈస్టరు, క్రిస్మస్ అను ప్రత్యేక పండుగలు మొదలగునవి రెండవ శతాబ్దపు అంతమునుండి ఆరంభమాయెను. ఇవన్నియును ప్రతిమారాధన చేయువారి నుండి అనుకరించబడెను (Newman, 1:298-299).

11.

## ముగింపు

ఈ మార్పులన్నీ ఎట్లు కలిగెను ? ముఖ్యముగా అవి మూడు కారణాల వలన కలిగెను :

1. అగ్రస్థానముల కొరకు ప్రాకులాడుట వలన, మానవులలో ప్రాబల్యము కొరకు, శక్తికొరకు పోరాటము.
2. బైబిలు పఠనము యెడల నిర్లక్ష్యము. ప్రజలు తమకు తామే బైబిలు చదువుట మాని, తమ నాయకులకు ఆ పనిని అప్పగించిరి.
3. మానవులు బైబిలుకు బదులుగా మానవుల అభిప్రాయములకు ఘనత నిచ్చిరి. లేదా బైబిలుతో సాటియైనవిగా వాటినెంచిరి. అందువలన ప్రజలు బైబిలును మరచిరి. దాని బోధలను గూర్చి అజ్ఞానులైరి.

మానవులు బైబిలు యొక్క అధికారమును, క్రొత్త నిబంధన సూక్ష్మమాదిరిని వీడి, మరొక దానిని సృష్టించిరి. అది అనేక శతాబ్దముల మట్టుకు క్రీస్తు సువార్త వ్యాప్తికి, ఆయన రాజ్య విస్తరణకు ఒక గుది బండగా తయారయ్యెను. దైవిక నియమముల ఒక్కొక్కటి నెట్టివేయబడి వాటి స్థానమున మానవ నియమములు ఆచరణలోనికి వచ్చుట వలన సంఘము ఒక మానవ సంస్థవలె తయారయ్యెను. సృజనాత్మకమైన ద్వారములు తెరువబడిన తరువాత, సంఘములోనికి అన్ని రకాలైన మానవ కృత్యములు ప్రవేశించి కళంకిత మానవుల చేతిలో అది చిక్కుబడిపోయెను (Maynard, page 38).

## దేవుడున్నాడా ?

(Is there a God ? )

అనాది కాలమునుండి నేటివరకు 'దేవుడున్నాడా' అను ప్రశ్న ఉత్పన్న మగుచునే యున్నది. అయితే దేవుడు లేడని చెప్పు నాస్తికులు ఉన్నారు; దేవుడు

ఉన్నాడని చెప్పు ఆస్తికులు ఉన్నారు. నాస్తికులకంటే ఆస్తికులే ఎక్కువ ఉన్నప్పటికి, ఉన్నాడని రుజువు పర్చువారు బహు తక్కువగానున్నారు. దీని విషయమై అనేక బైబిలు సదస్సులు నిర్వహించబడుచున్నవి.

'దేవుడున్నాడా ?' అను ప్రశ్నలోనే దేవుడున్నాడనే సత్యం చెప్పక చెప్పుచున్నది. దేవుడు లేడని చెప్పువారు, దేవుడుంటే మాకు చూపండి మేము నమ్ముతాము అని చెప్పడం మనం సర్వసాధారణంగా వింటూనేయున్నాము. మరి మనం దేవుని చూపించగలమా? చూపించలేము. ఏలయనగా, దేవుడు నిరాకారుడు గనుక, కనుపించడు. గాలి మనకు కనిపించదు. కనుక గాలిలేదన గలమా ? లేదనలేము. కరంట్ మన కంటికి కనుపించదు, మరి కరంట్ లేదనగలమా ? లేదనలేము. ఆలాగే దేవుడు మనకు కనుపించకపోయినను దేవుడు లేడని చెప్పలేము. గాలి పీల్చుకొని మనం బ్రతుకుచున్నాము. చెట్లు, ఆకులు కదలికవలన, మన శరీరరమునకు కలుగు స్పర్శవలన గాలి ఉన్నదని నమ్ముచున్నాము. స్విచ్ వేసినపుడు లైట్లు వెలుగుతాయి గనుక కరంట్ ఉన్నదని గ్రహించుచున్నాము. మనలోని ఆత్మ సుఖ దుఃఖముల ప్రతిస్పందననుభవించుచున్నది గనుక మనలో ఆత్మ ఉన్నదని నమ్ముచున్నాము. మరి దేవుడున్నాడని నమ్ముటకు ఆధారములేవి? దేనిని బట్టి దేవుడున్నాడని నమ్మగలం ? ఇప్పుడు పరిశీలిద్దాం.

ఒకడు తన తండ్రిని తండ్రియని తెలిసికొనుటకు తల్లిమూలాధారం. ఆలాగుననే దేవుడున్నాడని తెలిసికొనుటకు వేదము మూలాధారం. ఆ వేదము బైబిలు. దేవుడున్నాడను సంగతి తెలియజేయు బైబిలును గూర్చి కొన్ని విషయాలు తెలిసికొనుట అత్యంతావశ్యకమైయున్నది.

బైబిలు :- బైబిలు అనగా గ్రంధము లేక గ్రంధ సముదాయము అనిఅర్థము. అనగా గ్రంధములు సంపుటి. దీనినే ఇంగ్లీషులో The Holy Bible అనియు, తెలుగులో 'పరిశుద్ధ గ్రంధమని' యు పేరు. ప్రపంచములో బైబిలునకు తప్ప

మరి ఏ గ్రంథమునకు పరిశుద్ధ గ్రంథమని పేరులేదు. బైబిలుకు మాత్రం పరిశుద్ధ గ్రంథమని పేరు పెట్టబడెను. ఎవరైన ఒక గ్రంథమును వ్రాసిన, దానియొక్క పేరు ఆ గ్రంథమునకు తగినదై యుండవలెను. అట్లు పరిశుద్ధ గ్రంథము ఆ పేరుకు తగినదై యున్నది. కారణం ? బైబిలు రచయిత దేవుడు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

1. 'అప్పుడు యెహోవా వాక్కు సమూయేలుకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను" (1సమూ. 15:10).
2. "సైన్యములకు అధిపతియగు యెహోవా వాక్కు ఇదే" (యెష 14:22).
3. "దేవుడు యదార్థవంతుడు, యెహోవా వాక్కు నిర్మలము, తన శరణుజొచ్చిన వారికందరికి ఆయన కేడెము" (కీర్తన 18:30).
4. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమో 3:16,17).
5. "ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని యిచ్ఛను బట్టి కలుగలేదు గాని, మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగా పలికిరి" (2పేతురు 1:20,21).

కనుక బైబిలు రచయిత దేవుడు. దేవుడు పరిశుద్ధుడు గనుక బైబిలుపరిశుద్ధ గ్రంథమైయున్నది. బైబిలు, సాంఘిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, వైద్య, వైజ్ఞానిక, ఖగోళ, భూగోళ చారిత్రక గ్రంథములకు మూలాధారమునై యున్నది. ఇట్టి మహా గ్రంథమునకు గ్రంథకర్త దేవుడే. ఈ పరిశుద్ధ గ్రంథమే దేవుడున్నాడని నిరూపించుచున్నది. కాబట్టి బైబిలు దేవుడున్నాడని ఎలా నిరూపించుచున్నదో, కొన్ని లేఖనములన్ను పరిశీలిద్దాము.

## I. సృష్టి దేవుడున్నాడని నిరూపించుచున్నది :-

1. కీర్తనలు 19:1-3. ఈ లేఖనమును 3వ వచనమునుండి ప్రారంభించి1వ, వచనం వరకు పైకి చదివిన, విషయ అవగాహన సులువుగానుండునని భావించుచున్నాను.

వ. 3-1 "వాటికి భాషలేదు, మాటలు (లేవు) రావు, వాటి స్వరము వినబడదు. రాత్రికిరాత్రి జ్ఞానము తెలుపుచున్నది, పగటికి పగలు బోధ చేయుచున్నది. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది, ఆకాశములు దేవుని మహిమ పరచుచున్నవి",

ఈ వాక్యం చదువుతూ వుంటే మీకాశ్చర్యం కలుగుట లేదా ? నిజముగా నాకు ఆశ్చర్యము కలుగుచున్నది. ఈ పకృతికి భాషలేకపోయినను, మాటలు రాకపోయినను, స్వరము పలుకకపోయినను, దేవుడున్నాడని ఆ దేవుని గొప్ప మహిమను వివరించుచుండగా దేవుడు మానవునికి భాష నేర్పి, మాటలు పలుకుటకు చక్కని స్వరమునిచ్చి, చదువు, జ్ఞానము యిచ్చి, సత్యవాక్యమును చేతికి అందిస్తే ఎంతమంది దేవుని కార్యములను గూర్చి వివరించుచున్నారు ? మానవుడు, తానూ ఆయన మహిమకరమైన సృష్టిలో ఒక భాగమని గ్రహించలేక పోవుచున్నాడు. మూగబోయిన ఓ మానవుడా, లే... నిద్రలేచి, సత్యవాక్యమును చేబూని, నీనుండి నలుమూలలా ప్రకటించుము. ఈ సృష్టి దేవుఢున్నాడని నిరూపించుచున్నదని గొంతెత్తి చాటుము.

2. సృష్టింపబడిన వస్తువులు దేవుని బయలుపర్చుచున్నవి :-

రోమా 1:19,20 "ఎందుకనగా, దేవుని గూర్చి తెలియశక్యమైనదేదో, అది వారిమధ్య విశదమై యున్నది? దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని, సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన

తేటపడుచున్నవి గనుక, వారు నిరుత్తరులైరి". దీనిని బట్టి మనకేమి బోధపడుచున్నది ? భూమిమీద సృష్టింపబడిన ప్రతి వస్తువు, అనగా సముద్రములు నదులు, పర్వతములు దేవుడున్నాడని ప్రకటించుచున్నవి. మనకంటికి కనబడు ఒక ఆశ్చర్యకార్యమేదనగా, నీటి ప్రవాహమునకు మానవుడు ఇసుకను అడ్డుకట్టవేయగలడా ? ఎవడును వేయలేడు. అయితే దేవుడు మహా సముద్ర తరంగములకు ఇసుకను అడ్డుకట్టవేసి వాటికి సరిహద్దులు నియమించినాడు. ఇట్టి కార్యములు దేవుడున్నాడని నిరూపించుచున్నవి.

(a) భూమి పుట్టినది మొదలు నేటివరకు సముద్రమునుండి తుఫానులు బయలుదేరి మానవ జీవితమును అస్తవ్యస్తము చేయుచున్న సంగతి విదితమే. ఆనాటినుండి ఈనాటి వరకు ఆ తుఫానునుండి ఎలా రక్షించు కొనవచ్చునని నిత్యం ఆలోచిస్తున్నాడు గాని, ఆ తుఫానులను ఆపుటకేమైనా ప్రయత్నాలు చేయుచున్నాడా ? ఎంత మాత్రమును లేదు. ఎందుకని ? అది మానవుని వశములో లేదు. యేసు "దోనె ఎక్కినపుడు ఆయన శిష్యులు ఆయన వెంట వెళ్లిరి. అంతట సముద్రము మీద తుఫాను లేచినందున ఆ దోనె అలల చేత కప్పబడెను. అప్పుడాయన నిద్రించుచుండగా శిష్యులు ఆయన యొద్దకు వచ్చి, ప్రభువా నశించిపోవుచున్నాము మమ్ము రక్షించుమని ఆయనను లేపిరి. అందుకాయన అల్ప విశ్వాసులారా, ఎందుకు భయపడుచున్నారని లేచి గాలిని సముద్రమును గద్దింపగా, మిక్కిలి నిమ్మళ మాయెను. ఆ మనుష్యులు ఆశ్చర్యపడి ఈయన ఎట్టివాడో ఈయనకు గాలియు (తఫాను) సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి" (మత్తయి 8:23-27). ఇట్లు గద్దింపగల శక్తి ఎవరికున్నది ? దేవునికి మాత్రమే కలదు. ఈ కార్యము దేవుడున్నాడని నిరూపించుచున్నది.

3. సంతానము కలుగుట :- మానవులలో కొందరికి సంతానం కలుగుతుంది, మరికొందరికి కలుగదు కారణమేమి ? అది దేవుని చిత్తమే యైయున్నది. "కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము, గర్భఫలము ఆయన యిచ్చు బహుమానమే" (కీర్తన 127:3). కనుక దేవుడున్నాడని రుజువగు చున్నది.

4. నీటిని ఉత్పత్తి చేయుటను బట్టి దేవుడున్నాడని రుజువుచేయుచున్నది : హైడ్రోజన్ వాయువు+ఆక్సిజన్ సమ్మేళనము వలన నీరు ఉత్పత్తియగు చున్నది. ఈ నీరు $H_2O$ సూత్రంపై ఆధారపడి నీరు ఉత్పత్తి యగుచున్నది. అనగా హైడ్రోజన్ 2పాళ్ళు ఆక్సిజన్ ఒక పాలు కలిపిన. నీరు ఉత్పత్తి యగును. ఇట్లు $H_2O$ సూత్రమునకు ఏ కొంచెం భిన్నముగా ఆక్సిజన్ పాళ్ళు కలిసిన నీరు ఉత్పత్తి కాదు. ఆక్సిజన్ వాయువుకు మండే స్వభావం ఉన్నది గనుక ఆక్సిజన్ ఎక్కువపాళ్ళు కలిసిన నీరు ఉత్పత్తి కాకపోవుటయే గాక, అగ్ని పుట్టే ప్రమాదమున్నది. మరి, భూమి పుట్టినది లగాయతు యీ నిమిషము వరకు $H_2O$ సూత్రం ప్రకారం హైడ్రోజన్, ఆక్సిజన్ 2:1 నిష్పత్తిలో మిశ్రమము చేసి నీరు ఉత్పత్తి చేయుచున్న కర్త ఎవరు ? ఆయనే దేవుడు. కనుక దేవుడున్నాడు.

5. గ్రహముల నిర్మాణం, వాటి పరిభ్రమణం, దేవుడున్నాడని నిరూపించు చున్నవి : అంతరిక్షమునందు కోటానుకోట్ల గ్రహములుండుట మనమెరిగి యున్నాము. అందు నవ గ్రహములలో భూమి. చంద్రుడు, సూర్యుని మనమెప్పుడు చూస్తూనే ఉన్నాము. వీటిని దేవుడే నిర్మించెనని బైబిలు చెప్పుచున్నది (ఆది.1:14-19).

భూమి $23\frac{1}{2}$ డిగ్రీలు ఏటవాలుగా నుండి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుచున్నది.ఇట్లు భూమి సూర్యుని చుట్టూ ఒక నిర్దిష్టమైన

దూరములో తిరుగుచున్నది. అట్లు నిర్దిష్టమైన దూరముగాకుండ, సూర్యునికి కొంచెము దగ్గరగా వచ్చిన భూమి మండి భస్మమైపోవును. లేదా, సూర్యునికి మరికొంచెము దూరముగా, తిరిగిన భూమి దానిపై సమస్త ప్రాణులు శీతలముతో గడ్డకట్టి పోవును. ఇట్టి ప్రమాదములు సంభవింపకుండ భూమి పుట్టినది మొదలు యిప్పటివరకు భూమిని సూర్యచంద్రులకు సమాంతర దూరములో నడుపుచున్న వ్యక్తి ఎవరు ? ఆ వ్యక్తియే దేవుడు. (సశేషం)

- జి.మార్క్క, నందిగామ.

# క్రీస్తు యొక్క రెండవ రాకడ
## (The Second Coming of Christ)

క్రీస్తు మరల వచ్చును. క్రొత్తనిబంధనలో మూడు వందలకంటె పైగానున్న వచనములు ఆ సంఘటనను గూర్చి చెప్పుచున్నవి లేక సూచించుచున్నవి. దురదృష్టముగా ఆయన రెండవ రాకడను గూర్చిన అనేక సిద్ధాంతములు. విభేదము లుండుటచే క్రైస్తవులలో అనేకులు ఈ అంశమును సరిగ పరిశీలించలేక పోవుచున్నారు.

## ఆయన రాకడ ఖచ్చితము

క్రీస్తు యొక్క రెండవ రాకడ బైబిలులో ప్రశ్నింపతగని వాగ్దానము. యేసు ఆరోహణుడైనప్పుడు అపొస్తలులు ఆకాశమువైపు తేరి చూచుచుండగా దూతలు వారికి ఇట్లు చెప్పిరి: "గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు ? మీ యొద్ద నుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే ఏ రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆరీతిగానే ఆయన తిరిగి వచ్చును" (అపో.కా. 1:11). మరల వత్తునని యేసే చెప్పెను. తన శిష్యులను విడిచిపెట్టకముందే యేసు వారితో ఇట్లనెను: "మీకు స్థలము సిద్ధపరచ

వెళ్ళుచున్నాను; నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్ము‌ను తీసికొని పోవుదును" (యోహాను 14:2,3). క్రీస్తు మరల వచ్చునని అపొస్తలులు ప్రకటించిరి. "పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును" అని పౌలు చెప్పెను (1థెస్స 4:16). హెబ్రీ పత్రిక లేఖకుడు ఆయన "రెండవసారి ప్రత్యక్షమగును" అని చెప్పెను (హెబ్రీ 9:28). "ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుము" అని యోహాను పలికెను (1యోహాను 3:2).

మొదటి దినములలో వలెనే ఇప్పుడు కూడా ప్రభువు రాకడను శంకించువారు కొందరున్నారు. "అంత్య దినములలో అపహాసకులు అపహసించుచు వచ్చి తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొనుచు, ఆయన రాకడను గూర్చిన వాగ్దానమే మాయెను ? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్లే నిలచియున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసికొనవలెను" (2పేతురు 3:3,4). అవిశ్వాసులు సంశయించినను, అపహాసకులు పరిహసించినను క్రైస్తవులు బైబిలునందు విశ్వసించుదురు గనుక ఆయన రెండవసారి ప్రత్యక్ష మగునని వారు నమ్ముదురు. ఈ వాగ్దాన నెరవేర్పును గూర్చి దేవునికి వెయ్యేండ్లు ఒక దినముగానున్నది (2పేతురు 3:3,4). "కొందరు ఆలస్యమని యెంచు కొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి, ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతము కలవాడై యున్నాడు. అయితే ప్రభువు దినము వచ్చును" (2పేతురు 3:9.10). ఈ లోకమును, ప్రస్తుత పరిస్థితులును అంతమగును. ఈ భూమి ఇకలేకుండ పోవును. యేసు మరల వచ్చును. అంతేగాకుండా, క్రీస్తు రెండవరాకడ ఈ లోకాంతమందు వచ్చును. అప్పుడు కాలము గడిచిపోవును. అది ఆఖరి యుగములో ఆఖరిదినము.

## 19.

## ఆయన రాకడ కనబడునట్టిది

క్రీస్తు రాకడ వ్యక్తిగతమైనది, దృగ్గోచరమైనది, వినదగునది, మహిమగలది మరియు హఠాత్తుగా వచ్చునది. యేసు వచ్చునప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచును. దేవుని కుమారుని సిలువ వేసినవారును ఆయనను చూతురు: "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు; ప్రతి నేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచిన వారును చూచెదరు ; భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు" (ప్రకటన 1:7). ప్రభువు వచ్చునప్పుడు ఆయనను చూచుటకు ఎవడును ఒక ప్రత్యేక స్థలమునకు వెళ్ళనవసరములేదు. వారెక్కడ ఉన్నను భూజనాంగములన్నియును ఆయన రాకను పరికింతురు: "మెరుపు తూర్పున పుట్టి పడమటి వరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్య కుమారుని రాకడయుండును... అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి భూమిమీదనున్న సకల గోత్రముల వారు రొమ్ము కొట్టుకొందురు" (మత్తయి 24:27-30).

ఆయన మేఘారూఢుడై (అపొ.కా. 1:9,11; మత్తయి 26:64). అగ్నిజ్వాలలలో (2థెస్స 1:8). తన మహిమగల దూతలతోను (2థెస్స 1:7; మత్తయి 16:27). తన వేవేల పరిశుద్ధుల పరివారముతోను (యూదా :14). ఆర్భాటముతోను ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను దిగి వచ్చును. ఆయన రాక అగోచరమైనది గాక బట్టబయలుగా అందరికీ కనబడునట్టిది. అనుకొనని గడియలో హఠాత్తుగా ప్రభువు ప్రత్యక్షమగుట అవిశ్వాసులకు భయంకరమైన దృశ్యము కాని నీతిమంతులకు అదొక ఆశ్చర్యకరమైన దినము.

## ఆ గడియ తెలియనిది

ఆయన రాకడ యొక్క సమయము దేవుని మనస్సులో దాచబడియున్నది. దేవునికి మాత్రమే చెందిన రహస్యములలో ఇదొకటి (ద్వితీయ 29:29). ఆ తేదీ

ఏ మానవునికి దేవుడు బయలు పరచలేదు. ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు యేసు ఇట్లనెను: "ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు" (మార్కు 13:32). ఆయన రెండవ రాకడ మధ్యరాత్రిలో గాని లేక తెల్లవారుజామున గాని యుండవచ్చును; ఏ సమయమునందైనను ఆయన ప్రత్యక్షము కావచ్చును; అది ఈరోజే కావచ్చును. అదెప్పుడు జరుగునో మానవుడెరుగడు. అయితే ఒకటి మాత్రము అతడెరుగును. అదేమంటే జలప్రళయమునకు ముందువలె ఈలోక జీవనము యధావిధిగా యుండును; మరియు అనేకులు సిద్ధపడక యుందురు. "నోవహు దినములు ఏలాగుండెనో మనుష్య కుమారుని రాకడయును ఆలాగే యుండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసుకొనుచు, పెండ్లి కిచ్చుచు నుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవువరకు ఎరుగకపోయిరి; ఆలాగుననే మనుష్య కుమారుని రాకడ ఉండును" (మత్తయి 24:37-39).

క్రీస్తు రాకడ హఠాత్తుగా ముందు హెచ్చరిక లేకుండా యుండును. అనుకొనని రీతిగా, ఎవరికి చెప్పకుండ ఒక దొంగ వచ్చునట్లు ఆయన వచ్చును (2పేతురు 3:10; 1థెస్స 5:2). గనుకనే ఈ గంభీర హెచ్చరిక: "మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుకయే మీరును సిద్ధముగా ఉండుడి" (మత్తయి 24:44).

## తేదీలు నిర్ణయించువారు మోసగించుచున్నారు

క్రీస్తు రాకడ సమయమును ఎవరు ఎరుగరు గనుక ఆయన రాకడను గూర్చి తేదీలు నిర్ణయించుట పరిహాసకరమైనది. అయినను కూడ ఇది జరిగెను. ఇంకా జరుగుచున్నది. మరియు ఈ తేదీలు నిర్ణయించువారిని బట్టి మంచి మనసు గల వారనేకులు మోసగించబడుచున్నారు. ఉదాహరణకు : ఎడ్వంటిస్టు

ఉద్యమమును స్థాపించిన విల్లియం మిల్లర్ అనునతడు క్రీస్తు 1843లో అక్టోబరు నెలలో వచ్చునని జోస్యము చెప్పెను. అట్లు చెప్పి అనేకులను అతడు నమ్మించెను. తన అనుచరులు వారి ఆస్థులను అమ్మివేసి, తమకొరకు తెల్లటి ఆరోహణ దుస్తులను తయారుచేసుకొని ప్రభువు ప్రత్యక్షత కొరకు ఆనందముతో కనిపెట్టిరి. ఆ తేదీ వచ్చెను గాని క్రీస్తు రాలేదు. నిరుత్సాహపడినను, మిల్లర్ ఓడిపోలేదు. గనుక తన ప్రవచన లెక్కలలో ఒక సంవత్సరమును గూర్చి పొరపాటు చేసితినని తన అనుచరులకు చెప్పి ప్రభువు ఆ మరుసటి సంవత్సరమున అతడు నిర్ణయించిన తేదీన వచ్చునని ప్రకటించెను. మరల ఆ తేదీ వచ్చెను గాని, 1844లో క్రీస్తు రాలేదు.

తరువాత, యెహోవా సాక్షులు అనే గుంపును స్థాపించిన చార్లెస్ టి. రస్సెల్ అనునతడు క్రీస్తురాకడను గూర్చి వ్రాసెను. 1874లో అక్టోబరు నెలలో ప్రభువు వచ్చెను గాని కొంతమంది మాత్రమే అనగా అతని అనుచరులు మాత్రమే దాని నెరుగుదురనియు మిగిలిన వారందరికి అది దృగ్గోచరము కాలేదనియు అతడు చెప్పెను. ఇంతకు ముందే మనము గమనించిన దేమంటే ప్రభువు వచ్చినప్పుడు ప్రతినేత్రము ఆయనను చూచును (ప్రక 1:7). ఆయన వ్యక్తిగతముగా వచ్చును. ఆయన రాకడను నీతిమంతులు, అనీతిమంతులు చూడగల్గుదురు.

'పాస్టర్ రస్సెల్' అని తరుచు పిలువబడుచున్న యతడు, క్రీస్తు రెండవ రాకడతో ఆరంభమగు 'సువర్ణయుగమును' గూర్చి అనేక ప్రవచనములు చేసెను. అయితే ఈ విషయములో అతడు చేసిన ప్రవచనములున్నియు అతడొక అబద్ధ ప్రవక్తయని నిరూపించెను. "ప్రవక్త యెహోవా నామమున చెప్పినప్పుడు ఆ మాట జరుగకపోయిన యెడలను ఎన్నడు నెరవేరకపోయిన యెడలను అది యెహోవా చెప్పిన మాటకాదు; ఆ ప్రవక్త అహంకారము చేతనే దానిని చెప్పెను గనుక దానికి భయపడవద్దు" (ద్వితీ 18:22).

1916లో రస్సెల్ చనిపోగా, జడ్జి రూథర్ ఫోర్డు అనునతడు అతని సింహాసనమునకు వారసుడాయెను. అతడు కూడ ప్రవచనములు పలికెను. 1920లో 'ఇప్పుడు జీవించుచున్న లక్షలాది ప్రజలు ఎన్నడు మృతిజెందరు' అనే చిన్న పుస్తకమును రూథర్‌ఫోర్డు ప్రచురించెను. 1925లో మృతిబొందిన నీతిమంతులు లేపబడుదురనియు, అప్పటికి సజీవులుగా యుండి విమోచన కర్తను అంగీకరించిన వృద్ధులందరు తమ యౌవన ప్రాయమును తిరిగిపొంది భూమిమీద నిత్యము జీవించుచు మరణమును ఎన్నడు చూడరనియు అతడు ఆ పుస్తకములో ప్రవచించెను. అంటే 1925లో చెక్కతో చేయబడిన కాళ్ల కలిగిన వృద్ధులందరికి క్రొత్త అవయవములు లభించును. పళ్ళు కట్టించు కొనినవారికి క్రొత్త పళ్ళు లభించును. మరియు బట్టతల కలిగిన వారందరికి వెంట్రుకలు మొలకెత్తునని దీనియర్థము; అంతే కాకుండా అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, దావీదు మొదలగువారు మిగతా పాతనిబంధన వ్యక్తులతో సహా భూమిమీద జీవించెదరని, 1925 తరువాత వారు అందరికీ కనబడుదురని అతడు ప్రవచించెను. నిజముగా 1925 సువర్ణయుగము యొక్క ఆరంభమగును. అయితే ఇదంతయు 1925 ముందు ప్రజలకు చాల చక్కగా కనబడెను. గాని 1925 వచ్చెను. రూథర్ ఫోర్డ్ ప్రవచనములన్నియు విఫలమాయెను. 1925 తరువాత అతడు కూడ చనిపోయెను. 1925 రాగా జీవించుచున్న లక్షలాది ప్రజలలో అతడొకడు కాని అతడు చనిపోయెను. అతడు కూడ ఒక అబద్ధ ప్రవక్తయే.

1939లో క్రీస్తు వచ్చునని మరొకడు చెప్పెను. మరికొందరు దాని తరువాయి తేదీలను నిర్ణయించిరి. అయితే ఆ తేదీలలో ఆయన ప్రత్యక్షమాయెనా ? గనుక దేవుని వాక్యము నెరుగని వారిని ఈ తేదీలు నిర్ణయించువారు మోసగించుచునే యున్నారు.

మానవులచే నిర్ణయించబడిన ఏ తేదీలలోను క్రీస్తురాలేదు గనుక ఆ యంశమును గూర్చి మానవునికి ఇసుమంతయును తెలియదని నిర్ధారణయగు

చున్నది. ఈ వాస్తవములను బట్టి చూచిన, క్రీస్తురాకడ కొరకు తేదీలను కొందరు ఎందువలన నిర్ణయించుటకు పూనుకొనుచున్నారు ? క్రీస్తు రాకడ కొరకు వీరొక తేదీని నిర్ణయించగా ఈ అబద్ధ ప్రవక్తలు దానిని బహుగా యెరిగిన వారని ప్రజలు వారినే ఎందుకు నమ్మెదురు ? ఆ తేదీ ఎవరికిని బయలు పరచబడలేదు.

## సవరణ చేయబడిన తేదీలు నిర్ణయించువారు మోసగించుచున్నారు

రక్షకుని రాకకొరకు కొందరు ఒక ప్రత్యేక తేదీని నిర్ణయించరు గాని ఆయన రాకడ సమీపముగా యున్నదని, అది "ఈ సంవత్సరములో" లేక "ఈ తరములో" జరుగునని నొక్కి చెప్పుదురు. ఇది సంభవమే కాని బైబిలు అట్లు బోధించుటలేదు. క్రీస్తురాకడ బహు సమీపముగా నున్నదని మొదటి శతాబ్దములో లేఖనములు బోధించలేదు (2థెస్స 2:1-3); మరియు ప్రభువు యొక్క రెండవరాకడ బహు ఆసన్నమైనదని అవి ఎప్పుడు బోధించుటలేదు. చరిత్రలో మున్నెన్నడు లేని విధముగా లోకాంతమును గూర్చి ప్రజలు ఆలోచించుచున్నారు. మిగుల క్షోభమును పుట్టించెడు బోధను బట్టియు, వ్రాతలను బట్టియు కొందరు లొంగి పోయినను మరికొందరు అబద్ధ ప్రవక్తల వలన ఆఖరి సంగతులను గూర్చి బైబిలును పఠించుటలో ఉదాసీనులైరి. (సశేషం)

- పెర్రి కోతమ్

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమముల ద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. 25/-లు ఈ క్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ. 100-00 లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయము తెరవండి. మా వద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు:

| | |
|---|---|
| 1. కీర్తన పుస్తకం | రూ. 15-00 |
| 2. రిఫరెన్సు బైబిలు | 95-00 |
| 3. పెద్ద అచ్చు బైబిలు | 100-00 |
| 4. బైబిలు | 55-00 |
| 5. 15 నుండి 20 పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : పోస్టేజీ అదనం. మీరు పంపు సైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**

**P.O. BOX 80, KAKINADA - 533 001**

పోషించాలి మరియు నడిపించాలి. అబద్ధ బోధకుల నుండి మందను కాపాడుటయే గాకుండా, సత్యవాక్యములో స్థానిక సంఘమును పెద్దలు నడిపించువారై యుండాలి. యోహాను సువార్త 10:1-16 వరకు యున్న వాక్యభాగముపై ఆధారపడి సంఘ పెద్దల యొక్క బాధ్యతలను సోదరులు జెరెమిగారు చక్కగా వివరించిరి. సోదరులు టాడ్ జాన్సన్ గారు బైబిలు యదార్ధమని, అది దేవుని వాక్యమని అనేక శాస్త్రీయ, సాంఘిక ఉదాహరణలను వాస్తవములను యిస్తూ చక్కటి సందేశములనిచ్చిరి. జాన్ రిక్కీ గారు దేవుడు సర్వశక్తిమంతుడని, అయినను భూలోకములో ఆయన చిత్తమును నెరవేరుటకు మానవునిపై ఆయన ఆధారపడియున్నాడని హెచ్చరించారు. యేసుప్రభువు లాజరును తిరిగి బ్రదికించినప్పుడు అతని సమాధిపై యున్న రాతిని పొర్లించుమని మానవులకు చెప్పారు. అది మానవుడు చేయగలపని. గాని చనిపోయిన వానిని లేపే పని మానవుడు చేయలేడు. అది దేవుని పని. ఆలాగే కావాలంటే ఈలోకానికంతకూ దేవదూతల ద్వారా ఆయన సువార్త ప్రకటింప చేయగలడు, గాని మీరు సర్వలోకానికి వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి యని ఆయన మానవులకు ఆజ్ఞ యిచ్చారు. దాన్ని నెరవేర్చవలసిన బాధ్యత మానవులకున్నది యని రిక్కీ గారు హెచ్చరించారు. సాయంకాల సమయంలో జాషువా గారు వందన సమర్పణ చేయగా, సోదరులు వి. చిన్నయ్య గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను.

జెరెమి బేరియర్ దంపతులు, టాడ్ జాన్సన్ గారు, రిక్కీ గారు కలసి 22వ తేదీ గురువారం అనపర్తి షారోను పురంలో యున్న సంఘమును దర్శించారు, పై నలుగురు, జాషువా గారు 24 తేదీ శనివారం నాడు నడిపూడి, అమలాపురం గ్రేసులాండ్ మరియు పేరాయిచెర్వులో యున్న క్రీస్తు సంఘములను దర్శించి వాక్య పరిచర్య చేసారు. నడిపూడిలో ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందారు.

జూలై 25వ తేదీ ఆదివారం పైనుదహరించిన అమెరికా యౌవనస్థులు కాకినాడ రామారావ్ పేట క్రీస్తుసంఘము ఆరాధనలో వాక్యపరిచర్య చేసారు.

ల రాత్రి అనపర్తికి సమీపములో యున్న పి.రామచంద్రపురం గ్రామంలో ఏర్పాటు చేయుబడిన చక్కటి సువార్త కూటములో వారు వాక్యపరిచర్య చేసారు. 26వ తేదీన వారు మద్రాసు చేరుకొని 27న బేంకాక్ మీదుగా అమెరికాకు తిరుగు ప్రయాణం చేసియున్నారు.

జాన్ రిక్కీ గారు ఆగష్టు 18న బయలుదేరి 20వ తేదీనాటికి అమెరికా చేరి అక్కడ తన విద్యను కొనసాగించనున్నారు. గనుక ఆయన నిమిత్తం ప్రార్థించండి.

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada - 533 004.
Editor : Joshua Gootam

RNI Regd. No. 69973/98

PRINTED BOOK - BOOK POST

From:

SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To